వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని మాకవరం గ్రామపంచాయతీ మాకవరం గ్రామంలో వరి కుప్పలను ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో దగ్ధమయ్యాయని మాకవరం గ్రామపంచాయతీ వీఆర్వో విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి కుప్పలు కాలిపోవడంతో ఒక్కొక్కరికి సుమారు రూ.50,000 నష్టం వాటిల్లినట్లు ఆమె తెలిపారు.ఈ ఘటనపై ప్రభుత్వం దృష్టికి నివేదికలు పంపుతామని తెలిపారు.

మంటలను ఆర్పుతున్న రైతులు

సాగు భూములకు హక్కు కల్పించాలి

- రైతులు వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి:తమ సాగు భూములు తమకే హక్కు కల్పించి, కేటాయించాలని కబ్జాకు పాల్పడిన భూస్వాములపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గిరిజన రైతులు అర్ధనగ్నంగా వినూత్న రీతిలో చేతులు జోడించి కలెక్టర్‌ను వేడుకుంటూ నిరసన చేపట్టారు. మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ కొండ శిఖరం గ్రామాలైన బూరిగ, చిన్నకోనెల గ్రామాల భూ సాగు రైతులు గురువారం గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సోమ్మెల అప్పలరాజు మాట్లాడుతూ, బూరిగ, చిన్నకోనెల. గ్రామాలకు చెందిన 70 మంది రైతులు 105 ఎకరాల భూమిని తాత ముత్తాతల కాలం నుండి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. 2017 సంవత్సరంలో అప్పటి తహశీల్దార్, భూస్వాములతో కుమ్మకై గిరిజనేతరుల పేరు మీద ఆన్లైన్లో నమోదు చేశారన్నారు. దీనిపై సబ్ కలెక్టర్ కోర్టులో ఫిర్యాదు చేయడంతో ఆర్ ఓ ఆర్ కేసు కింద నమోదు చేశారన్నారు.చీఫ్ సెక్రెటరీ కు కలిసి ఫిర్యాదు చేయగా ఈ భూముల వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశించినప్పటికీ తమకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. అందుకే ఈ వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జిల్లా కలెక్టర్ న్యాయం చేయాలని, లేకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బూరిగ. పెంటయ్య, సోమ్మెల .సన్యాసిరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న రైతులు

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

విద్యారంగ సమస్యలపై పోరాటం

- పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని, తనను శాసన మండలికి పంపించేందుకు అందరూ సహకారం అవసరమని పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ గౌరీ తెలిపారు.మండలంలో గల వివిధ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సమరెడ్డి రాజు ఆధ్వర్యంలో గురువారం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ గౌరీని గెలిపించాలని ప్రచారం చేపట్టారు. యుటిఎఫ్ అల్లూరి జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావుతో కలిసి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి జోలాపుట్, లబ్బూరు, పనసపుట్టు , ముంచింగి పుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సందర్శించారు. టీచర్స్ ఎమ్మెల్సీగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పట్ల యుటిఎఫ్ సంఘంలో విజయనగరం జిల్లాలో మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర కార్యదర్శి వరకు పనిచేసానని తనను ఎన్నుకుంటే విద్యారంగ సమస్యల పట్ల నికరంగా పోరాడుతానని మహిళనైన తనను శాసన మండలికి పంపించేందుకు అందరి సహకారం అవసరమని కోరారు.రానున్న శాసనమండలి టీచర్స్ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిని గెలిపించి శాసనమండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముంచింగిపుట్టు మండల యుటిఎఫ్ కార్యదర్శి ఎస్ గోపి, మండల కమిటీ సభ్యులు పుండరీ, దయానిధి, గంగాధర్, జె.సత్యనారాయణ,ఈశ్వరనాయుడు పాల్గొన్నారు.

5న సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి -సీలేరు: సాగునీటి సంఘాల ప్రతినిధుల ఎన్నికకు వచ్చేనెల 5న నోటిఫికేషన్ విడుదల చేస్తామని జీకే వీధి మండల తహశీల్దార్ రామకృష్ణ వెల్లడించారు మండల పరిధిలో చెక్కలమద్ది, గుమ్మరేవులు సాగునీటి సంఘాల ప్రతినిధుల ఎన్నిక జరుగుతుందని తెలిపారు. దీనికి సంబంధించిన ఓటర్ల జాబితా ఇంతకు ముందే ప్రకటించామన్నారు. జరిగిందని తాసిల్దారు వెల్లడించారు. ఎన్నికల నిర్వహణకు పోలింగ్ అధికారులను కూడా నియమించామన్నారు. వీరికి ఎన్నికల నిర్వహణపై ఇరిగేషన్ అధికారులు శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. ఎన్నికల తేదీ రోజునే నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ఉపసంహరణ ఉంటుందని, ఆ తర్వాత ఎన్నికలను నిర్వహించి, వెంటనే ఫలితాలు వెంటనే ప్రకటించి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. పోటీలో ఒక అభ్యర్థి కంటే ఎక్కువ మంది ఉంటేనే ఎన్నికలు జరుపుతామని ఒకవేళ ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఎన్నుకున్న వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. సాగునీటి సంఘాలు ఎన్నికలు నిర్వహించేటప్పుడు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అందరూ సహకరించాలని కోరారు ఎన్నికల సందర్భంగా ఎటువంటి గొడవలకు ఆస్కారం లేకుండా సంబంధిత ఎస్ఐలు పర్యవేక్షిస్తారన్నారు.

లోదొడ్డిలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

ఆదివాసీ గిరిజన సంఘం నేతల వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి పంచాయతీలో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు జర్ర రాజబాబు, మండల నాయకులు కొత్తూరు సత్యనారాయణ కోరారు. గురువారం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వాతంగి నుంచి లోదొడ్డి వెళ్లే విద్యుత్ లైన్లులో వైర్లు శిథిలావస్థకు చేరడంతో వర్షం వచ్చే సమయంలో లోదొడ్డి పంచాయతీకి తరచూ విద్యుత్ సమస్య ఉంటుందన్నారు. పివిటిజి గ్రామాలకు విద్యుత్ కనెక్షన్లు పూర్తిస్థాయిలో వేయడం లేదన్నారు. . పర్వత ప్రాంతమైన కిండంగి గ్రామాల్లో సుమారు 30 కుటుంబాలు నివసిస్తున్నా, అక్కడ నేటికీ కరెంటు సౌకర్యం లేదన్నారు. లోదొడ్డి గ్రామం నుండి కొమరాపురం వరకు విద్యుత్ స్తంభాలు మార్చి త్రీఫేస్ కనెక్షన్ ఇవ్వాలని కోరారు. పలు విద్యుత్ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గురువారం అడ్డతీగలలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కార వేదికలో అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం పరిశుభ్రంగా ఉంచుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా చూడాలని ఐటీడీఏ పీవో వి అభిషేక్ సూచించారు. స్వచ్ఛత డ్రై కార్యక్రమంలో భాగంగా స్థానిక పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆయన గురువారం సందర్శించి పరిశీలించారు. పర్యాటకులకు కావలసిన సౌకర్యాలపై స్థానిక అధికారులను, టూరిజం శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛత డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పర్యాటక ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చిరు వ్యాపారులతో, అధికారులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చిరు వ్యాపారాలు ఉపయోగించిన మంచినీటి బాటిల్లు, కవర్లు రోడ్డుపై, జలపాతం ప్రదేశంలో పడవేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాపారులు ఉపయోగించిన చెత్త చెదారం వేసేందుకు డస్ట్ బిన్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు పంచాయతీ ద్వారా ఆశీలు వేలంపాటను నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్ సాగర్, డిప్యూటీ తహశీల్దార్ ముజీబ్, పంచాయతీ కార్యదర్శి విజయ్, టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివద్ధికి దోహదం

డుంబ్రిగుడ: రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా ఏర్పాటు చేసిన వన్ ధన్ కలెక్షన్ సెంటర్లో సరుకులు నిల్వ ఉంచి మార్కెట్లో ధర పెరిగిన తర్వాత విక్రయిస్తే ఆర్థికంగా రైతులుతోపాటు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందని పిఒ అభిషేక్ చెప్పారు. మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్‌ను పిఓ గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి కొనుగోలు చేసి నిల్వ ఉంచి ఉన్న రాజ్ మాతో పాటు పలు రకాల పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యతగా తయారు చేసి విక్రయించడానికి సామబియ్యం, రాగులు పిండి యంత్రాలను కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డి ఆర్‌డిఏ పిడి వి.మురళి, ఏపిఎం, రైతు ఉత్పత్తిదారుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

వినతులను పరిష్కరిస్తాం

- జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ క్యాంపు కార్యాలయం లో గురువారం ప్రజా దర్బార్ నిర్వహించారు ఈ సందర్భంగా సుమారుగా 45 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ప్రజలు, ఉద్యోగుల సమస్యల వినతులను రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ స్వీకరించారు.కాశీపట్నం జీసీసీ ఉద్యోగి రిటైర్డ్ అయినా సంబదించిన బెనిఫిట్స్ ఇంకా రాలేదన్నారు. జీసీసీ డి ఆర్ డిపో డీలర్స్ వేతనం పెంచాలని, భాష వాలంటీర్ లకు సి ఆర్ టీ గా మార్చాలన్నారు.డి ఆర్ డిపోలు మరమ్మత్తులు చేయాలనీ వినతి పత్రాలు అందించారు ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ స్పందిస్తూ సమస్యలను సంబంధిత అధికారులకు పంపించి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సాగర సుబ్బారావు, బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, శోభకోట సర్పంచ్ పలసీ శశి భూషణం నాయుడు, అండీభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, హుకుంపేట మండల ప్రధాన కార్యదర్శి సిర్గం కాంతమ్మ, మాజీ సర్పంచ్ కూడా వెంకటరావు, టీడీపీ నాయకులు కర్ర అచ్చిబాబు, స్వామి, గుజ్జెలి బొంజుబాబు, త్రినాధ్ కమలాకర్, మురళి, సాగర్, బుక్క జగదీష్ బలరాం పాల్గొన్నారు

వినతులు స్వీకరిస్తున్న కిడారి శ్రావణ్‌కుమార్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-విఆర్ పురం: మండలంలోని పెద్ద మట్టపల్లిలో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం తహశీల్దార్ సరస్వతి ప్రారంభించారు. మండలంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో ముందస్తు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, ధాన్యం సేకరణకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారి రఘు, ఆర్ఐ. రామకృష్ణ, వ్యవసాయ, రెవెన్యూశాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న అప్పలనర్స, నాయకులు, టీచర్లు

మెగా డిఎస్‌సిలో..

గురుకులం ఖాళీ పోస్టులను మినహాయించాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పల నర్స

ప్రజాశక్తి -పాడేరు : గిరిజన గురుకులంలో ఉన్న ఖాళీ పోస్టులను మెగా డిఎస్సీ నుండి మినహాయింపు ఇవ్వాలని సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స డిమాండ్ చేశారు. పాడేరు ఐ.టి.డి. ఏ వద్ద గిరిజన గురుకులం అధ్యాపకులు నిర్వహిస్తున్న నిరాహార దీక్ష శిబిరాన్ని గురువారం సందర్శించి మద్దతు ప్రకటించారు.13 రోజులుగా ఔట్సోర్సింగ్ టీచర్లు నిర్వహిస్తున్న రిలే దీక్షలు గురువారం కొనసాగాయి.. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత రెండు వారాల నుంచి రిలే దీక్షలు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ టీచర్ల ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. గత 15 ఏళ్లుగా విద్యా రంగంలో అన్ని శాంక్షన్ పోస్టుల్లో సీఆర్టీలు, అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయులు పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వీరిని శ్రమ దోపిడీకి గురి చేస్తోందని ధ్వజమెత్తారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నా స్పందించ లేదన్నారు. గిరిజన గురుకులం ఖాళీ పోస్టుల భర్తీకి మెగా డిఎస్సీ లో విలీనం చేయడం తగదన్నారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ ద్వారానే పోస్టు భర్తీ చేయాలని ఆయన కోరారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు పరచలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని ఆమె విమర్శించారు. ఉద్యోగాలు సాగించే వరకు పోరాటం కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బోజన్న, చిన్నారావు, దాస్, గురుకుల ఔట్సోర్సింగ్ టీచర్లు పాల్గొన్నారు.

గంజాయి సాగుపై డ్రోన్లతో నిఘా

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గిరిజన గ్రామాల్లో గంజాయి సాగుపై డ్రోన్లతో పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపుతోందని అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి చెప్పారు. మండలంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు అరకు సీఐ హిమగిరి ఆధ్వర్యాన గిరిజన గ్రామాల్లో డ్రోన్లతో గురువారం సర్వేను నిర్వహించారు. మండలంలోని అమలగుడ, బీజుమరవలస, కింజేరు, వసబంద, బీజుమరవలస సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ హిమగిరి మాట్లాడుతూ, అరకు సర్కిల్ పరిధి గిరిజన గ్రామాల్లో గంజాయి సాగు లేకుండా చూడాలన్నదే ఎస్పీ లక్ష్యమన్నారు. డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. గంజాయి సాగు, రవాణా చట్ట విరుద్ధమన్నారు. గంజాయి సాగు విడనాడి ప్రత్యామ్నయ పంటల సాగును చేపట్టి ఆర్థికంగా ఎదగాలన్నారు. సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వంకు నివేదికను అందించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అటవీ, రెవెన్యూశాఖ అధికారులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న పోలీసులు

రబ్బరు రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

• జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -మారేడుమిల్లి: ఏజెన్సీలోని గిరిజన రబ్బర్ రైతులు ఆర్థికాభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పూజారి పాకల రబ్బర్ ప్రాసెస్ కేంద్రాన్ని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీతో కలిసి సందర్శించారు. ముందుగా రబ్బర్ పాలు ప్రాసెస్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం రబ్బర్ రైతులతో సమావేశంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలోని రబ్బర్ రైతులకు చేదోడుగా ఉండేందుకు రబ్బర్ ప్రాసెస్ యూనిట్ షెడ్లు, స్మోక్ రూములు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఏడాదిలో ఎన్ని నెలల పాటు రబ్బర్ పాలు తీస్తున్నదీ, ఒక రోజుకు ఒక చెట్టుకు ఎన్ని రబ్బర్ పాలు ఇస్తున్నదీ, ఒక సంవత్సరంలో ఎకరం విస్తీర్ణంలోని రబ్బరు తోటల నుంచి ఎన్ని కేజీల రబ్బర్ సీట్లు ఉత్పత్తి అవుతుందని, ఎంత ఆదాయం వస్తుందనే దానిపై రబ్బర్ రైతులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాలలో, ఎంతమంది రైతులు రబ్బర్ ప్లాంటేషన్ చేస్తున్నదీ ఆరా తీశారు. ఈ ప్రాంతంలోని రబ్బర్ రైతులు ఐదుగురేసి సభ్యులను ఎంపిక చేసి సొసైటీగా ఏర్పడాలని, వారికి తగిన శిక్షణనిస్తామన్నారు.

ఈ సందర్భంగా మారేడుమిల్లి నేచరల్ ప్రొడక్షన్ ఫౌండేషన్‌లో 200 మంది సభ్యులున్నామని, తాము ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రూ. 10 కోట్లు మంజూరు చేయాలని సభ్యులు పల్లాల రాజ్ కుమార్, దొరి సోమయ్య, రామిరెడ్డి, కథల మొట్టి రెడ్డి, గొర్లె చిన్న నారాయణరావు, గొర్లె మురళీకృష్ణ, గొర్లె అనిల్ ప్రసాద్, పి జానకి రెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చి, వినతిపత్రం అందంచారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, అన్ని విషయాలను పరిశీలించి ముందుగా ఫౌండేషనుకు రూ. ఐదు లక్షలు మంజూరు చేస్తామన్నారు. దీని పర్యవేక్షణకు రంపచోడవరం సబ్‌కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. రబ్బరు మొక్కల సంరక్షణకు ఏడాదికి రూ.50వేలు ఉపాధిహామీ నిధులుమంజూరు చేస్తామన్నారు..మినీ పరిశ్రమలు ఏర్పాటుకు గిరిజన సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

కూడూరు నుండి పందిరి మామిడి కోట వరకు రెండు కిలోమీటర్లకు రహదారి ఏర్పాటు చేయాలని పి జానకిరెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు, వేటుకూరులో గోకులం షెడ్లు ఏర్పాటు చేయాలని కథల మొట్టి రెడ్డి కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించగా, వెంటనే స్పందించి మారేడుమిల్లి, వైరామవరం మండలాలకు రెండే చొప్పున గోకులం షెడ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. వై రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని ఆకు మామిడి కోట నుండి గుర్తేడు వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలని ఎడ్లకొండ, జీ. ఒట్టిగడ్డ గ్రామాలకు కమ్యూనిటీ భవనాలు మంజూరుచేయాలని, పాతకోట వరకు ఇపుడు ఒకేబస్సు తిరుగుతున్నందున మరికొన్ని బస్సులు ఏర్పాటు చేయాలని, గుర్తేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులను సిబ్బందిని అదనంగా ఏర్పాటు చేయాలని, రావడికోట, జీ.ఒట్టిగడ్డ గ్రామాలలో పక్కా స్కూల్ భవనాలు ఏర్పాటు చేయాలని గుర్తేడు పంచాయితీ సర్పంచ్ గొర్లె దుష్యంతుడు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. పాములేరు పంచాయతీలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కొండ కాలువ కల్వర్టు పునర్నిర్మించాలని, పాములేరు సచివాలయ భవనం, వెల్నెస్ సెంటర్ పనులు పూర్తి చేయించాలని పాములేరు పంచాయతీ సర్పంచ్ సార్ల రమాదేవి కోరారారు. అనంతరం మారేడుమిల్లి జలతరంగినిలో ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనసమారాధనలో కలెక్టర్ పాల్గొన్నారు.

మారేడుమిల్లి ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి అభినందించారు.కార్యక్రమంలో పిహెచ్ఒ కె..చిట్టిబాబు, ఉపాధి ఎపిడి జి. శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ ఐ.శ్రీనివాసరావు, ఎఇఇ సత్యనారాయణ, ఎంపిడిఒ విశ్వనాథ్, తహశీల్దార్ బాలాజీ, చౌదరి సామాజిక కార్యకర్త బల్ల మోహన్, చిన్ని బాబు పాల్గొన్నారు..

రబ్బరు పాల సేకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎర్రమట్టి క్వారీలపై సమగ్ర విచారణ

- బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్, ఇతర నేతలు
- అక్రమ క్వారీలను పరిశీలించిన సిపిఎం బృందం

శరభవరం పంచాయతీలో క్వారీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- దేవీపట్నం : మండలంలో ఎర్రమట్టి క్వారీలను నుంచి మట్టి అక్రమ తరలింపుపై సమగ్ర విచారణ చేపట్టి ,కఠినచర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, ఎం.వాణిశ్రీ, డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని శరభవరం పంచాయతీ పరిధిలోని గ్రామాలతోపాటు ఎం.రావిలంక, ముసలిగుంట గ్రామాల మధ్య అక్రమంగా ఏర్పాటుచేసిన ఎర్రమట్టి క్వారీలను సిపిఎం బృందం సందర్శించి పరిశీలించింది. అడ్డగోలుగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వకాలు జరుపుతూ, ఎర్రమట్టి తరలింపుపై క్షేత్రస్థాయిలో పరిశీలనతోపాటు దీనిపై ఆరా తీశారు ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి క్వారీలను ఏర్పాటు చేసి, మట్టిని యథేచ్ఛగా లారీల్లో ఇతర ప్రాంతాల నర్సరీలకు, ఇతర అవసరాలను తరలిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై మండిపడ్డారు. తక్షణమే జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు స్పందించి, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా ఎర్రమట్టి తరలించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

రావిలంక, ముసలిగుంట వద్ద రవాణాకు సిద్ధంగా ఉన్న మట్టిపై సిపిఎం బృందం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -జిమాడుగుల: సిపిఎం జిల్లా మహాసభల జయప్రదం చేయాలని మండల కేంద్రంలో గురువారం ఆ పార్టీ నేతలు గోడపత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సాగిన ధర్మన్న పడాల్ మాట్లాడుతూ, సిపిఎం జిల్లా మొదటి మహాసభ డిసెంబర్ 4, 5వ తేదీన పాడేరులో నిర్వహిస్తామన్నారు. గడిచిన మూడు సంవత్సరాల్లో జరిగిన ఉద్యమాలు, పోరాటాలు, వాటి ఫలితాలపై చర్చించుకొని రాబోయే కాలంలో పోరాటం చేస్తామన్నారు. కాఫీ రైతులకు బకాయి సొమ్ము చెల్లించి గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. పి.వి.టి.జి. తెగలకు ఇల్లు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని, జీవో 3 కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి మాతృభాషా విద్యా వాలంటీర్లను రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జగ్గం దొర, దీనబంధు, వసూరి సన్యాసిదొర, భాను. పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న సిబ్బంది

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల గూడలో ప్రతి గురువారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయ రాలు లక్ష్మి పేర్కొన్నారు. గురువారం విద్యార్థులకు సాధారణ వ్యాధులకు వైద్య సేవలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సాధారణ వ్యాధులతో పాటు మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల రక్త పరీక్షల నమూనాలు సేకరించి మందులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ టి.భాను ప్రసాద్, ఎమ్ ఎల్ హెచ్ పి.డి శైలజ , పాఠశాల మెట్రిన్ కె.వసంత, పిడి కృష్ణవేణి పాల్గొన్నారు,

సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి -అనంతగిరి: సచివాయం సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఎంపిడిఓ ఎవివి.కుమార్ సూచించారు. మండలంలోని టోకూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.సిబ్బంది ప్రతి రోజు ఉదయం సాయంత్రం హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఓ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్

ప్రతిజ్ఞ చేయిస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పర్యావరణ పరి రక్షణ బాధ్యత అందరికి ఉందని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సృష్టం చేశారు. గురువారం పద్మాపురం గార్డెన్, అరకులోయ గిరిజన మ్యూజియం లో స్వదేశీ దర్శన్ 2.0లో భాగంగా స్వచ్చతాహి సేవా కార్యక్రమం నిర్వహించి పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటకులు ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ ను వినియోగించవద్దని సూచించారు.ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల పరిశుభ్రతకు పర్యాటకులు సహకరించాలని స్పష్టం చేశారు. పద్మాపురం గార్డెన్, అరకులోయ గిరిజన మ్యూజియంలో పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత అంటూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు.అంతకుముందు స్థానిక ప్రభుత్వ కంఠబొంధుగూడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బేస్ లైన్ ఎగ్జామ్ ప్రకారం విద్యార్థులను ఏబిసిడి గ్రూపులుగా విభజించి సి డి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. కెరీర్ గైడెన్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని.విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యుఓ మల్లికార్జునరావు, మ్యూజియం మేనేజర్ మురళి, పద్మాపురం గార్డెన్ మేనేజర్ బుంజబాబు, స్వదేశీ దర్శన్ కోఆర్డినేటర్ రత్నరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయండి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈశ్వరి

మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి - చింతపల్లి :- ప్రభుత్వ కార్యక్రమాలలో ఎన్డీఏ కూటమి పార్టీలకు చెందిన నాయకులను భాగస్వాములను చేయాలని తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాధారణ బదిలీలలో భాగంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు ఉద్యోగులు బదిలీ కావడం, నూతన అధికారులు ఉద్యోగులు నియామితులు కావడం తో ఎన్డీఏ కూటమి పార్టీలకు చెందిన నాయకులు, అధికారుల ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని స్థానిక గిరిజన ఉద్యోగ భవన్ లో తెదేపా మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలలో తీసుకువెళ్ళే విధంగా కృషి చేయాలని సూచించారు. అదే క్రమంలో మండలంలో ప్రభుత్వం తరపున ఎటువంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసిన కూటమి పార్టీలకు చెందిన నాయకులకు తప్పక సమాచారం ఇవ్వాలని, అదే క్రమంలో అభివృద్ధి కార్యక్రమాల విషయంలో తనతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు ఆమె సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, పెదిరెడ్ల బేతాళుడు, బొర్ర విజయ రాణి, స్థానిక తహసీల్దార్ రవికుమార్ ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజు, వ్యవసాయ శాఖ ఏ ఓ శ్రీనివాసరావు, గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ కళ్యాణ్, పంచాయతీరాజ్ ఏఈ బాలకృష్ణ, పలు పంచాయతీ ల కార్యదర్శులు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, ఎన్డీఏ కూటమి పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి - చింతపల్లి : గిరిజన సేంద్రియ ఉత్పత్తులను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవనం సాగించాలని లంబసింగి గిరిజన ఉత్పత్తుల ఫార్మర్ ప్రొడ్యూసర్ డైరెక్టర్ ఇందిర సూచించారు. చింతపల్లి వారపు సంతలో గిరిజన సేంద్రియ ఉత్పత్తుల స్టాల్‌ను బుధవారం ఆమె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఎటువంటి రసాయన పదార్థాలు వాడకుండా కేవలం సేంద్రియ ఎరువులతో సాగైన వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా చిరుధాన్యాలు, ఇతర ఉత్పత్తులతో వివిధ రకాల పచ్చళ్ళు, జ్యూస్‌లు, పిండిలు తయారుచేసి విక్రయిస్తున్నామన్నారు.చిరుధాన్యాల (మిల్లెట్స్) ను పిండిగాను, నూక గాను తయారు చేసి విక్రయించడంతోపాటు, ఈ ప్రాంతంలో సాగయ్యే పనస, అనాస పనసలతో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయడం జరిగిందన్నారు. ఈ ఉత్పత్తుల వాడకంతో ఎటువంటి అనారోగ్యం దరి చేరదని, సంపూర్ణ ఆరోగ్యానికి సేంద్రియ ఉత్పత్తులే ఆధారమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినియోగదారులు ఎస్ వీరేంద్ర కుమార్, రాజు, ఐ అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులు

పవర్ డిప్లమో ఇంజినీర్ల అసోసియేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ ఎన్నికలు పాడేరు కాఫీ గెస్ట్ హౌస్ లో గురువారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు గా ఎన్.షాలేమురాజు, జిల్లా సెక్రటరీగా ఎం వెంకట రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.భాస్కర రావు, , ట్రెజరర్‌గా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. అలాగే పాడేరు డివిజన్ సెక్రటరీగా వి ప్రభాకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా త్రినాధరావు, ట్రెజరర్‌గా రాము నాయుడులను ఎన్నుకున్నారు.

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి- పెదబయలు : పెదబయలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (హైస్కూల్)లో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థుల హాజర పట్టికను పరిశీలించారు. పాఠశాలలో విద్యా బోధనపై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను తప్పక పాటించాలని సూచించారు. ఆయన వెంట వైఎస్ఆర్సిపి నాయకులు కొండబాబు, మాజీ జెడ్పిటిసి సూర్యనారాయణ ఉన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రోడ్డు విస్తరణకు సర్వే

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: జిల్లా కలెక్టర్‌ఆ దేశాల మేర మండల తహసిల్దార్ నర్సమ్మ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ నిమిత్తం మండల కేంద్రంలో గురువారం సర్వే చేపట్టారు. తహసిల్దార్ నరసమ్మ మాట్లాడుతూ, మండల కేంద్రంలో విపరీతమైన ట్రాఫిక్ అంతరాయంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆర్ అండ్ బి సరిహద్దు భూములను స్వాధీనం చేసుకుని వివిధ రకాల కట్టడాలతో అనుభవిస్తున్న వారిని త్వరలోనే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు లోబడి ఇచ్చిన గడువులో దుకాణాలను ఖాళీ చేయాలని కోరారు. ఈ కార్యక్రంలో విఆర్వోలు రమేష్ కుమార్, పద్మారావు, సర్వేయర్ దామోదరం పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీలను త్వరితగతిన పూర్తి చేయండి

ప్రజాశక్తి - చింతపల్లి :- గ్రామ సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న స్వర్ణ పంచాయితీ నమోదు, ఎన్‌పిసిఐ బ్యాంకు లింకేజీ, గృహాల జియో ట్యాగింగ్ తదితర వాటిని త్వరిత గతిన పూర్తి చేయాలని డివిజనల్ గ్రామ పంచాయితీ అధికారి పిఎస్ కుమార్ సూచించారు.. స్థానిక ఎంపీడీవో శ్రీనివాసరావుతో కలసి గురువారం ఆయన లమ్మసింగి, తాజంగి గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. గృహాల జియో ట్యాగింగ్ తదితర వాటిపై తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తాజంకి పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, అప్పలరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతపల్లి :- అల్పపీడన ప్రభావంపై వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి బీ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కందుల గాది, మల్లవరం గ్రామాలలో గిరి రైతులకు అవగాహన గురువారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండిన వరి పంట కోతలను పొడిగించుకోవాలని, అదే క్రమంలో కోత కోసిన వరి ఫణలను కుప్పలుగా పెట్టుకొని తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచాలని సూచించారు.ఈ పంట లో నమోదు చేసికొని ఎకరానికి రూ.300 ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని చెప్పారు.

మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పిల్లల దత్తత చట్టబద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పిల్లలను అమ్మినా, కార్మికులుగా మార్చినా కఠిన చర్యలు తప్పవని, పిల్లలు కావలసినవారు దత్తతను చట్టబద్ధంగా తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశుసంక్షేమం, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. గురువారం ఉదయం స్థానిక ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో ఫోస్టర్ అడాప్షన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ చట్టబద్ధమైన దత్తతపై అందరికీ అవగాహన అవసరమన్నారు. రాష్ట్రంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 27 శిశు గృహాలు ఉన్నాయన్నారు. అనాథలు, వదిలివేయబడిన, అప్పగించబడిన 0-6 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు రక్షణ, సంరక్షణను అందించడంలో అవి ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం వాటిలో 108 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారని, గడిచిన కాలంలో 473 మంది పిల్లలు స్వదేశీ దత్తతకు, 114 మంది పిల్లలు విదేశీ దత్తతకు ఇవ్వబడ్డారని తెలిపారు. విదేశాలకు తీసుకువెళ్లి పిల్లలను కార్మికులుగా మార్చిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అమలులో ఉన్న దత్తత విధానాలను మంత్రి తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ 6 నుండి 18 సంవత్సరాల పిల్లలు మంచిగా, ఆర్థికంగా ఎదగడానికి ఫోస్టర్ అడాప్షన్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తప్పిపోయిన పిల్లల విషయాలను 1098 చైల్డ్ హెల్ప్ లైన్లకుగానీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీల దృష్టికిగానీ తీసుకెళ్లాలన్నారు. ఈ విషయాలపై ప్రతి అంగన్వాడీ వర్కర్ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి ,శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, రీజనల్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.చిన్మయ దేవి, జాయింట్ డైరెక్టర్ విజయ, ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయ దేవి, ఎపిఎస్‌పిటిసిఆర్ ఛైర్మన్ అప్పారావు, పిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ రాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యాదవుడే మాధవుడు చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరానికి చెందిన వియ్యపు చిన్నారావు నిర్మాతగా, గీతా ప్రసాద్ దర్శకత్వంలో జగన్మాత సినీ క్రియేషన్స్ నిర్మించిన యాదవుడే మాధవుడు సినిమా శుక్రవారం నగరంలోని చిత్రాలయ ఐమాక్స్ థియేటర్‌లో విడుదలవుతున్న సందర్భంగా చిత్ర యూనిట్ గురువారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఆ చిత్రంలో నటించిన ఎపి మా అధ్యక్షులు దాడి సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ నగరానికి చెందిన కళాకారులతో నిర్మించిన ఈ చిత్రం తప్పనిసరిగా విజయవంతం అవుతుందన్నారు. నిర్మాత వియ్యపు చిన్నారావు మాట్లాడుతూ వ్యసనాలకు బానిసలై జీవితాలను విచ్ఛిన్నం చేసుకునే వ్యక్తులకు కనువిప్పు కలిగే విధంగా ఈ చిత్రాన్ని నిర్మించామన్నారు. సమావేశంలో చిత్ర అసోసియేట్ దర్శకురాలు హేమ వెంకటేశ్వరి, దర్శకుడు గీతా ప్రసాద్, ప్రముఖ రంగస్థల నటులు చలసాని కృష్ణ ప్రసాద్, పి.శివప్రసాద్, వర్రే నాంచారయ్య, ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించడానికి అందరూ కలసికట్టుగా కృషి చేయాలని ఎక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ఆఫ్ హోల్డ్ జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.డేవిడ్‌రాజు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బాల్య వివాహ్ ముక్త్ భారత్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 50 గ్రామాలలోని 5 వేల మంది చేతులు కలిపి 'బాల్య వివాహ్ ముక్త్ భారత్'కు స్వాగతం పలికేందుకు పాదయాత్రలు నిర్వహించారు. అనంతరం జగదాంబ జంక్షన్‌లో మానహారం ఏర్పాటు చేసి, బాల్యవివాహల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నుంచి విముక్తి అయిన బాలికలు, మహిళలు, పురుషులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అందరూ కలిసికట్టుగా నినాదాలు చేశారు. అనంతరం ప్రతినబూనారు.

ఫార్మాలో ప్రాణాలకు రక్షణేదీ ?

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భద్రత పతనం
వరుస ప్రమాదాలు - నియంత్రణకు చర్యలు శూన్యం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని ఫార్మా పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై విచారణ కమిటీల నివేదికలు రాకముందే వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం కార్మికుల ప్రాణాలను బలితీసుకుంటోంది. ఈ విధానంలోని లోపాలను సరిదిద్దకుండా మరింత ఉల్లంఘనలకు యాజమాన్యాలు పాల్పడేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఎన్ని ఉల్లంఘనలకు పాల్పడినా ప్రభుత్వం తమ పక్షాన ఉందని భావించి యాజమాన్యాలు కనీస భద్రత, రక్షణ ప్రమాణాలను అమలుచేయడంలేదు. పరిశ్రమల తనిఖీ అధికారుల అధికారాలకు ప్రభుత్వం కోత పెట్టడంతో పరిశ్రమల్లో కార్మికుల భద్రతను యాజమాన్యాలు దాదాపు పట్టించుకోవడం మానేశాయి. ఆ దుష్ఫలితాలే ప్రమాదాల రూపంలో కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 21న అసెన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదంలో 17 మృతిచెందారు. 38 మంది గాయపడ్డారు. ఈ గాయం మర్చిపోకముందే సినర్జిన్ కంపెనీ ప్రమాదంలో గాయపడ్డ కార్మికులు నలుగురు మృతి చెందారు. ఈ ప్రమాదాలపై నివేదికలు రాకముందే పరవాడ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీలోని ఠాగూర్ లేబొరేటరీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించారు. మరొక కార్మికుడు పరిస్థితి విషమంగా వుంది. ఈ కంపెనీలో మంగళవారం అర్ధరాత్రి విషవాయువులు లీకై కార్మికులు అస్వస్థతకు గురైనా బుధవారం ఉదయం ఆరు గంటల వరకు వారిని ఆసుపత్రికి తీసుకెళ్లలేదు. కార్మికుల ప్రాణాల పట్ల యాజమాన్యం ఎంత నిర్లక్ష్యంగా వుందో ఈ ఘటన తెలియజేస్తోంది.

పరిశ్రమల ప్రమాదాలపై ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ విచారణ పూర్తికాకముందే ఠాగూర్‌లో ప్రమాదం జరిగింది. ప్రమాదాలకు యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలిసినా వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ప్రమాద తీవ్రత, ఆ సమయంలో ప్రతిస్పందనలను బట్టి కార్మిక కుటుంబాలకు యజమానులతో పరిహారం చెల్లించేలా ప్రభుత్వం మధ్యవర్తిపాత్ర పోషిస్తోంది తప్ప ప్రాణం తీసిన యాజమానులపై సరైన చర్యలు తీసుకోవడంలేదు. ఫార్మా పరిశ్రమల్లో పనిచేయడానికి కార్మికులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇళ్లు కాలిపోతే బొగ్గులేరుకొనే వాళ్లు తయారైనట్లు, ప్రమాదాలను అడ్డం పెట్టుకొని లాభపడుతున్నవారు లేకపోలేదు. కంపెనీల నుంచి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు సేకరించడంతో వున్నకొద్దిపాటి భయం కూడా యజమానులకు పోయింది.

జిల్లాలో 126 వివిధ భారీ పరిశ్రమల్లో పనిచేస్తున్న దాదాపు 68 వేల మందిలో 35 వేల మంది 81 రసాయన, ఫార్మా కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఇంత భారీస్థాయిలో కార్మికులు పనిచేస్తున్న రసాయన, ఫార్మా పరిశ్రమల్లో అటు ప్రభుత్వం, ఇటు యాజమాన్యమూ భద్రతపై దృష్టి పెట్టడంలేదు. రెడ్ కేటగిరీలోని 190 పరిశ్రమల్లో 40 పరిశ్రమల్లోనే సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. లాభాలకు ఇచ్చిన ప్రాధాన్యతను కార్మికుల ప్రాణాలకు ఇవ్వడం లేదని సేఫ్టీ ఆడిట్ నిర్వహణ తీరు తెలియజేస్తోంది. ఇప్పటికైనా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాలి. రక్షణ పరికరాలు అందేలా చర్యలు తీసుకోవాలి.

ఫార్మా ప్రమాద బాధితులకు సిపిఎం పరామర్శ

పరవాడ ఫార్మాసిటీలోని ఠాగూర్ లేబొరేటరీలో జరిగిన ప్రమాదంలో విషవాయువు పీల్చి అస్వస్థతకు గురై విశాఖ నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సిపిఎం, సిఐటియు నాయకులు గురువారం పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బాధితురాలిని పరామర్శిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

ప్రజాశక్తి - గాజువాక : కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, సిఐటియు అనకాపల్లి జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావులు పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సౌకర్యాలను, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరికి రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఇంతమంది క్షతగాత్రులు కావడానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని, ప్రమాదం జరిగిన తర్వాత కూడా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగి విషవాయువులు పీల్చి 29 మంది ప్రాణపాయస్థితిలోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. సేఫ్టీ పరికరాలు, రక్షణ చర్యలు తీసుకుని ఉంటే ప్రమాద తీవ్రత తగ్గేదన్నారు. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రాణాలకు యాజమాన్యాలు ప్రాధాన్యత ఇవ్వాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

విశాఖ కలెక్టరేట్ : విషవాయువు లీకై మృతి చెందిన కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మృతుల కుటుంబ సభ్యులను కెజిహెచ్ మార్చురీ వద్ద ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమలలో నిత్యం ప్రమాదాలు జరిగి కార్మికులు చనిపోతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ప్రమాదాలు తరువాత వేసిన కమిటీల నివేదికలు ఎప్పటికీ బయటకు రావడం లేదన్నారు. ప్రమాదాలకు కారణమైన పరిశ్రమల యాజమాన్యాలను అరెస్టులు చేయడంగానీ, శిక్షించడంగానీ చేయడం లేదన్నారు. దీంతో యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నాయని తెలిపారు. నిరంతరం పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ జరపాలన్నారు. ప్రమాదం జరిగిన తరువాత హడావుడి చేసే కంటే ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మారేడుమిల్లి / రంపచోడవరం : మారేడుమిల్లి 33కెవి ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతులు దృష్ట్యా ఈనెల 29న శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఇఇ టి.గాబ్రియేల్ ఒక ప్రకటనలో తెలిపారు. మారేడుమిల్లి మండలం పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి- దేవీపట్నం : ప్రభుత్వపరంగా మంజూరుచేసిన ఇళ్ల నిర్మాణాలకు రూ.పది లక్షల ఆర్థికసాయం అందజేయాలని రంపచోడవరం మండల న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్, ఆదివాసీ జెఎఇ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ అన్నారు. గ్రామీణ హౌసింగ్ కాలనీ కింద దేవీపట్నంలో 161 ఇళ్లు మంజూరు కాగా, ప్రభుత్వం అందించిన రూ.2.10లక్షల సాయం ఎటూ సరిపోక కేవలం పదిమంది మాత్రమే తమ సొంత డబ్బులతో ఇళ్లను నిర్మించుకున్నారన్నారు. 11ఇళ్లు శ్లాబ్ దశలో ఉన్నాయని, 71ఇళ్లపునాదుల గోతులతో ఉన్నాయని, 44 ఇల్లు అసలు పూర్తి ప్రారంభించలేదన్నారు గృహనిర్మాణాలకు సంబంధించి ముడిసరుకుల ధరలు పెరగడంతో ప్రభుత్వం ఇచ్చిన సాయం సరిపోక, ఇళ్లు మంజూరైనా నిర్మాణాల జోలికి లబ్ధిదారులు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఇవే కాకుండా ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీ, పివిటిజి హౌసింగ్, జన్‌మన్ ఇతర పథకాల్లో మంజూరుచేసిన ఇళ్లకు ఆర్థికసాయం రూ.పది లక్షలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో యలగాడ నాగేశ్వరావు, కారం రామన్న దొర, కుండ్ల సాయిరామ్ రెడ్డి, నడిపూడి భాను శంకర్ రెడ్డి, గణపతి రెడ్డి ఉన్నారు.

ఎఎస్‌డబ్ల్యుఒ సరెండర్ అన్యాయం

ప్రజాశక్తి -సీలేరు: నర్సీపట్నం సహాయ సాంఘిక సంక్షేమ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎం . శ్యామలను సరైన విచారణ లేకుండా ఎటువంటి ముందస్తు మెమోలు జారీ చేయకుండా అకారణంగా హెడ్ క్వార్టర్‌కు సరెండర్ చేయడాన్ని డిటిఎఫ్ జికె. వీధి మండల శాఖ తరపున ఖండిస్తున్నామని అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. వినోద్‌కుమార్, ఎం.లక్ష్మణరావు తెలిపారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్లకు మెమోలు జారీ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వారిపై ఎటువంటి విచారణ చేపట్టకుండా వార్డెన్‌కు కొమ్ముకాస్తూ, గిరిజన మహిళ ఎఎస్‌డబ్ల్యుఒ శ్యామలపై చర్యలు తీసుకుని సరెండర్ చేయడం అమానుషమన్నారు. ఇప్పటికైనా గిరిజన ఉద్యోగులపై అధికారులు చిన్నచూపు చూడడం మానుకోవాలని, వార్డెన్లకు కొమ్ముకాస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కోశాధికారి డి. రవి ప్రసాద్ సీనియర్ నాయకులు ఎంవి. దొర, ఎంవి. రమణ, బి..వీరబాబు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాలయాపన, బోధనకు ఆటంకం కలిగించే విధంగా ఉన్నటువంటి రెసిడెన్షియల్ శిక్షణా తరగతులను తక్షణమే రద్దుచేసి ఉపాధ్యాయుల ప్రాణాలను కాపాడాలని యుటిఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎఫ్ఎల్ఎన్, ఎస్ఎల్‌టిపి పేరుతో రెసిడెన్షియల్ పద్ధతిలో నడుపుతున్న శిక్షణ కేంద్రాల్లో ఉపాధ్యాయులు మరణించడం దురదృష్టకరమన్నారు. గురువారం విజయనగరం జిల్లా గజపతినగరంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించడం పట్ల తీవ్ర సంతాపం తెలియజేస్తూ, మరణానికి బాధ్యులైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

సెవెన్‌హిల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని ఎపి హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. సెవెన్ హిల్స్ యాజమాన్యం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్య చర్యలకు నిరసనగా గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సెవెన్ హిల్స్ కార్మికులు నిరాహార దీక్ష చేపట్టారు. 'కార్మిక శాఖ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగాలు కోల్పోతున్న కార్మికులు, చనిపోయిన ఒక కార్మికుని బొమ్మ'ను ప్రదర్శిస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎంజిఎం సెవెన్ హిల్స్ యాజమాన్యం కొన్నేళ్లుగా కార్మికులపై ఉక్కు పాదం మోపుతోందన్నారు. ఈ విషయంపై లేబర్ డిపార్టమెంట్‌లో, కలెక్టర్ ఆఫీసులో ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.